

రక్షిత నీరందించాలి

ఆన్‌లైన్ ద్వారా పన్ను వసూళ్లు

అనుమతి లేని లేఅవుట్లలో నిర్మాణాలకు నో

కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం రూరల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి):కాలువల నుంచి నీరు విడుదల కావడంతో జిల్లాలో కుళాయిల ద్వారా రక్షిత నీరందించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నాగరాణి అధికారులకు సూచించారు. తాగునీరు, పన్ను వసూలు, శానిటేషన్, అనుమతులు లేని లే అవుట్లలో నిర్మాణాలు తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఆన్‌లైన్ ద్వారా పన్ను వసూళ్లను సత్వరమే ప్రారంభించాలన్నారు. జిల్లాలో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనుమతులు లేకుండా అనధికార లేఅవుట్లు వేసి నిర్మాణాలు చేపడుతున్నారని, అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఇన్‌చార్జి డీపీవో వై.దోసిరెడ్డి, ఎంపీడీవోలు, పంచాయతీ సెక్రటరీలు, డీఎల్‌పీవోలు తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం

భీమవరం టౌన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరు కలిసికట్టుగా పని చేద్దామని కలెక్టర్ నాగరాణి అన్నారు. జిల్లా కార్మిక శాఖ ఆధ్వర్యంలో ప్రకాశం చౌక్ నుంచి మునిసిపల్ కార్యాలయం వరకు ర్యాలీని కలెక్టర్ ప్రారంభించారు. బడి ఈడు పిల్లలందరూ బడిలో చదువుకునే విధంగా కృషి చేయాలన్నారు. ఏఎస్పీ వి.భీమారావు, జిల్లా కార్మిక శాఖ అధికారి ఎ.లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కూల్ కూల్

తగ్గిన ఎండ.. చల్లబడిన వాతావరణం

ఆచంట, జూన్ 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వాతావరణం కాస్త చల్లబడింది. బుధవారం పలుచోట్ల చినుకులు పడడం, ఆకాశం మబ్బులతో ఉండటంతో ప్రజలు ఉపశమనం పొందారు. గడిచిన పది రోజులుగా ఎండ వేడి, ఉక్కబోతతో జనం ఉక్కిరిబిక్కిరి అయ్యారు. 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కాగా బుధవారం భీమవరంలో 35 డిగ్రీలకు పడిపోయింది. వాతావరణం చల్లబడడంతో ప్రజలు సేద తీరారు.



అభివృద్ధే మంత్రం

తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నేటికి ఏడాది. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు ఒక్కో అడుగు ముందుకేశారు. వైసీపీ హయాంలో ఐదేళ్లు జిల్లాలో కక్ష సాధింపులు, అక్రమ కేసులతో పాలన సాగిందని, అభివృద్ధి శూన్యమని ప్రజలు భావించారు. అప్పట్లో ప్రభుత్వంపై ప్రజల అభిప్రాయాలను వెల్లడించేందుకు కూడా భయపడ్డారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో పాలనలో మంచి, చెడులను బాహాటంగా మాట్లాడుకునే పరిస్థితి జిల్లాలో ఏర్పడింది. సమస్యల పరిష్కారం కోసం ప్రతి ఒక్కరూ నియోజకవర్గ ఎమ్మెల్యేలు, కూటమి నాయకులు వద్దకు వెళుతున్నారు. పట్టణాల్లో వైసీపీ హయాంలో ఐదేళ్లపాటు అమృత్ ప్రాజెక్ట్‌లు పడకేశాయి. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే అమృత్ పథకంలో ప్రాజెక్ట్‌లకు అడుగులు పడ్డాయి.

- పోటీ పడిన ఎమ్మెల్యేలు
- కొత్తదనం, మార్పు చూపించే ప్రయత్నం
- ఉండిలో రఘురామ సరికొత్త ప్రయోగం
- పాలకొల్లులో మంత్రి నిమ్మల రూటే సపరేటు
- వివాదాలు పక్కనపెట్టి సంక్షేమం వైపు
- ప్రజలు కోరుకున్న 'మార్పు' చూపించారు
- తొలి ఏడాది పాలనలో దూసుకెళ్లారు..

(భీమవరం/ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

మార్పు కోరుతూ ప్రజలు కూటమికి ఎలాంటి విజయాన్ని అందించారో అదే కోణంలో ప్రతీ నియోజకవర్గంలో సరికొత్త మార్పు.. మార్కు చూపించడానికి ఎమ్మెల్యేలు చెమటోడుస్తున్నారు. ఏడాది పాలనలో నువ్వా నేనా అనే విధంగా అన్ని నియోజకవర్గాల్లో అభివృద్ధిలో పోటీ వాతావరణం నెలకొంది.

పాలకొల్లు నియోజకవర్గంలో జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తనదైన శైలిలో అభివృద్ధికి ప్రయత్నిస్తున్నారు. నియోజకవర్గంలో రోడ్లతోపాటు మిగిలిన పెండింగ్ పనులను పూర్తి చేయడానికి సానుకూలత వ్యక్తమైంది. యలమంచిలి మండలంలో వానా కాలం వరద భయం. గోదావరి గట్లు పటిష్టతకు గడిచిన ఐదేళ్లలో నయాపైసా కూడా జగన్ సర్కార్ ఖర్చు పెట్టలేదు. కాని ఈ ఏడాది కాలంలోనే మంత్రి చొరవతో గోదావరి ఏటిగట్ల పటిష్టతకు నిధులు విడుదలై చకచకా పనులు సాగడానికి మార్గం ఏర్పడింది. పాలకొల్లు పట్టణాన్ని సరికొత్తగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ రూపొందించుకున్నారు. డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు ఏడాది కాలంలో తాను ప్రాతినిధ్యం వహిస్తున్న ఉండిలో మార్పు చూపించారు. మిగతా ఎమ్మెల్యేలు అందుకోలేనంతగా చకచకా నిర్ణయాలు తీసుకున్నారు. కాల్వ గట్లపై ఆక్రమణలు తొలగించడమే కాకుండా అన్ని కాలువలు, మురుగు కాలువల ప్రక్షాళనకు నడుం బిగించారు. పోలీస్‌స్టేషన్ల భవనాల నిర్మాణం, వాహనాలు సమకూర్చడమే కాకుండా నియోజకవర్గంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తున్నారు. రాజకీయాల్లో ఎంతవేగంగా వ్యవహరిస్తారో అభివృద్ధి, సంక్షేమంలో రఘురామ అంతకంటే వేగంతో వ్యవహరించారన్న భావన ప్రజల్లో ఉంది. నరసాపురం నియోజకవర్గంలో ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ పెను మార్పులకు ప్రయత్నించారు. రూ.7 కోట్లతో కొత్త రోడ్లు వేశారు. తాగునీటి పంపిణీ సక్రమంగా సాగేలా ఫిల్టర్ బెడ్‌లకు నాంది పలికారు. ఆక్వా యూనివర్సిటీ, హార్బర్, వశిష్ట వారధి ఎమ్మెల్యే ఆశించినట్టుగా ముందుకు సాగలేదు. తణుకు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ తన మార్కు చూపించారు. పట్టణంలో మూలనపడిన పార్కుకు జీవం పోశారు. సీఎం చంద్రబాబును ఒప్పించి రూ.50 కోట్లు నిధులు రాబట్టారు. రోడ్లను అద్దంలా తీర్చిదిద్దేందుకు రూ.20 కోట్లు రాబట్టడమే కాకుండా ఆ మేరకు పనులు చేయించారు. తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ నియోజకవర్గంలో అభివృద్ధికి కోట్ల రూపాయలు వచ్చేలా చూశారు. ఒక్క రైల్వే పనులకే రూ.300 కోట్లు, మినీ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ నిర్మాణం పూర్తి చేసేందుకు కృషి చేయడం అందరి మన్ననలకు దారి తీసింది. క్రికెట్ స్టేడియం నిర్మించాలనే ప్రతిపాదనవైపు ఆయన అడుగులు వేస్తున్నారు. ఆచంట నియోజకవర్గంలో ప్రజా సమస్యలను ముందుగా తెలుసుకోవడం, దానికి తగ్గట్టుగానే తదుపరి నిర్ణయాలు తీసుకోవడంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ విజయవంతమయ్యారు.

పట్టణాలు.. పల్లెలకు ప్రాధాన్యం

జిల్లాలోని అన్ని మునిసిపాలిటీల్లో దాదాపు రూ.250 కోట్ల విలువైన పనులకు శ్రీకారం చుట్టారు. తాడేపల్లిగూడెంలో రెండో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పూర్తి చేసేందుకు

(మిగతా 6వ పేజీలో)

కాల్వ పూడికతీత పనులు పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల (ఫైల్)



కేంద్ర మంత్రి వర్మ మెరుగైన పాత్ర



నరసాపురం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో సమస్యలే కాకుండా కేంద్ర సహాయ మంత్రి హోదాలో భూపతిరాజు శ్రీనివాసవర్మ మెరుగైన పాత్ర పోషించారు. తొలిసారి పార్లమెంట్‌లో అడుగుపెట్టినా తడబాటు లేకుండా ముందుకు సాగారు. ఉక్కు శాఖామంత్రి కుమారస్వామితో కలిసి విశాఖ ఉక్కుకర్మాగారం వివాద పరిష్కారంలో కీలకంగా వ్యవహరించడమే కాకుండా రాష్ట్రస్థాయిలో తగినంత అనుకూలత సాధించగలిగారు. ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో సాన్నిహిత్యం కొనసాగిస్తూనే పలుమార్లు రైతుల సమస్యలను నేరుగా ప్రస్తావించగలిగారు. రాష్ట్రాభివృద్ధిలో కేంద్ర మంత్రిగా తనదైన శైలిలో వ్యవహరించారు. నరసాపురం లోక్‌సభ స్థానం పరిధిలో ఆక్వా సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకున్నారు. రైల్వే స్టేషన్ ఆధునీకీకరణ, వందే భారత్ ఎక్స్‌ప్రెస్ నిలుపుదలలో కేంద్ర మంత్రి చురుగ్గా వ్యవహరించారు. ప్రత్తిపాడు - నవాబ్ పాలెం - ఆరుళ్ల మార్గంలో రైల్వే వంతెన నిర్మాణానికి రూ.200 కోట్లు కేటాయించేలా చేశారు. ఆకివీడు-దిగమర్రు నాలుగులైన్ల రహదారి అభివృద్ధికి కీలక భూమిక పోషించారు. లోసరి-పిప్పర జాతీయ రహదారి అనుసంధానానికి వంద కోట్లు మంజూరు చేయించారు. కిడ్నీ బాధితులను ఆదుకునేలా తన పార్లమెంట్ స్థానం పరిధిలో 7 డయాలసిస్ సెంటర్లను ఏర్పాటు చేయబోతున్నారు.

ఏడాది పాలనపై జిల్లాలో ఎమ్మెల్యేలు ఏమన్నారంటే.. 5

డీఎస్సీ పరీక్షకు 19 మంది గైర్హాజరు

భీమవరం రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి):భీమవరం డీఎన్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల, తాడేపల్లిగూడెం వాసవి ఇంజనీరింగ్ కళాశాలల్లోని 2 పరీక్షా కేంద్రాల్లో బుధవారం డీఎస్సీ పరీక్ష నిర్వహించారు. రెండు సెషన్స్‌లో కలిపి 260 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 241 మంది హాజరయ్యారు. 19 మంది గైర్హాజరయ్యారు. ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డీఈవో నారాయణ తెలిపారు.

స్పౌజ్ పింఛన్ల పంపిణీ వాయిదా

భీమవరం టౌన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి):స్పౌజ్ పింఛన్ల పంపిణీ వాయిదా పడింది. కూటమి పార్టీలు అధికారం చేపట్టిన ఏడాది పూర్తవుతున్న నేపథ్యంలో పెన్షన్ తీసుకుంటున్న వ్యక్తి మరణిస్తే అతని భార్యకు పింఛన్ (స్పౌజ్ పెన్షన్) ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జిల్లాలో 2,625 మంది పింఛన్లకు అర్హత సాధించారు. గురువారం విజయవాడలో ఎమ్మెల్యేలకు స్వచ్ఛ భారత్‌పై ప్రత్యేక కార్యక్రమం జరుగుతున్న నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు అధికారులు ప్రకటించారు. తిరిగి అందించే తేదీని త్వరలోనే ప్రకటిస్తారు.

అధికారితో..

ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్

మినీ గోకులాల ఏర్పాటు, ఉద్యానవన పంటలు, పశుపోషణలో గడ్డి పెంపకంలో ఉపాధి హామి నిధులకు సంబంధించి ఎవరికైనా సందేహాలు, సమస్యలు వుంటే వాటి పరిష్కారానికి డ్వామా పీడీ డాక్టర్ కేసీహెచ్ అప్పారావుతో ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించనుంది. ఈ నెల 12వ తేది గురువారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు వరకు 94406 25154 నెంబరుకు ఫోన్ చేసి ఆయనతో స్వయంగా మాట్లాడి సమస్యను పరిష్కరించుకోవచ్చు.

బడికి నవోదయం



నేడు పాఠశాలలు పునఃప్రారంభం

- విద్యా సంవత్సరం మొదలైంది..
- కొత్త విధానాలతో బోధన
- ప్రభుత్వ పాఠశాలలకు నూతన సొబగులు
- మధ్యాహ్న భోజనంలో సన్నబియ్యం
- పుస్తకాలు, యూనిఫామ్, బ్యాగ్, భోజనం అన్నీ ఉచితమే!

(భీమవరం రూరల్-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ పాఠశాలల పునర్వ్యవస్థీకరణ, టీచర్ల కేటాయింపు, సమగ్రమైన అకడమిక్ కేలండర్, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపయోగపడేలా రూపొందించిన సిలబస్, తదితర ప్రాధామ్యాలతో వేసవి సెలవుల అనంతరం గురువారం కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది. ప్రభుత్వ బడుల్లో నిలిచిపోయిన పనులకు మన బడి - మన భవిష్యత్ పథకంతో మోక్షం లభించనుంది. జగన్ ప్రభుత్వ హయాంలో జీవో 117 ఉత్తర్వులతో విధ్వంసానికి గురైన ప్రభుత్వ బడులను పునర్వ్యవస్థీకరణతో కూటమి ప్రభుత్వం బలోపేతం చేయడానికి సంకల్పించింది. ప్రాథమిక విద్యకు తొలి అడుగుపడే ఒకటో తరగతి నుంచే చిన్నారులు ప్రభుత్వ పాఠశాలలను ఆశ్రయించేలా తొలిసారిగా అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్య (ఎల్‌కేజీ, యూకేజీ)ను పూర్తి చేసిన పిల్లలందరినీ సమీప ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేర్పించే ప్రక్రియను ఇప్పటికే పూర్తి చేయడం విశేషం. కార్పొరేట్/ప్రైవేటు పాఠశాలల్లో ఉండే రూ.వేలు, లక్షల ఫీజుల మోత, ఆర్థికభారంతో నిమిత్తం లేకుండా, ఒక్కసారి ప్రభుత్వ పాఠశాలలో చేరితే చాలు పుస్తకాలు మొదలుకుని మధ్యాహ్న భోజనం, రాగి జావ, సుశిక్షితులైన టీచర్లతో అత్యాధునిక విద్యాబోధన వరకు ఉచితమే.

ప్రభుత్వ పాఠశాలల్లో నూతన బోధనా విధానంతో 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది. జిల్లాలోని విద్యా సంవత్సరం లెక్క ప్రకారం 1392 ప్రభుత్వ పాఠశాలల్లో 98,235 మంది విద్యార్థులు 344 ప్రైవేటు పాఠశాలల్లో 1,39,826 మంది విద్యార్థులు చదువుతున్నారు. 2025-26 విద్యా సంవత్సరంలో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం వుంది.

ప్రభుత్వ బడుల రూపం మారింది

ఈ విద్యా సంవత్సరం నుంచి 1,392 ప్రభుత్వ స్కూళ్లల్లో విద్యాబోధనలో మార్పులు చోటు చేసుకున్నాయి. 186 ఫౌండేషన్, 705 బేసిక్ ప్రైమరీ, 217 మోడల్ ప్రైమరీ పాఠశాలలు కాగా, పది యూపీ పాఠశాలలు బేసిక్ ప్రైమరీగాను, ఆరు యూపీ నుంచి మోడల్ ప్రైమరీగాను, ఎనిమిది యూపీలను అప్‌గ్రేడ్ చేసి హైస్కూల్స్ గాను, 19 యూపీ పాఠశాలలను అప్‌గ్రేడ్ చేసి హైస్కూల్‌తోపాటు మోడల్ ప్రైమరీగా మార్పు చేశారు. 197 హైస్కూల్స్‌గానే సాగిస్తూ, ఏడు హైస్కూల్స్‌లో బేసిక్ ప్రైమరీగా మారనున్నాయి.

ప్రైమరీకి సెమిస్టర్ వారీగా పుస్తకాలు

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైమరీ పాఠశాలల్లో విద్యా బోధనలో ఈ విద్యా సంవత్సరం నుంచి మార్పు చేశారు. రెండు సెమిస్టర్లుగా పాఠ్య పుస్తకాలు అందిస్తున్నారు. పుస్తకాల బరువు భారం తగ్గించడంతోపాటు విద్యాబోధనలో సులువు విధానం చేశారు. ఒకటి నుంచి పది వరకు రెండు సెమిస్టర్లు ఉంటాయి.



మధ్యాహ్న భోజనంలో మార్పులు

పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంలో ప్రభుత్వం గత ఏడాది చివరి నుంచి మార్పులు తీసుకువచ్చింది. జోన్‌ల వారీగా భోజన పథకాన్ని అమలులోకి తీసుకువచ్చింది. ఆరు జిల్లాలు జోన్‌గా ఏర్పాటుచేసి ప్రాంతాన్ని బట్టి మెనూ ఏర్పాటుచేసింది. జిల్లాలో 98 వేల మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం తింటున్నారు. ప్లస్ పాఠశాలలోను మధ్యాహ్న భోజనం అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ విద్యా సంవత్సరంలో ఉపయోగించే బియ్యంలో మార్పు తీసుకువచ్చారు. సన్నబియ్యం 25 కేజీల బస్తాలుగా పాఠశాలలకు ఇప్పటికే పంపించారు.

విద్యా సామగ్రి అందాల్సి ఉంది

నేటి నుంచి పాఠశాలల విద్యా సంవత్సరం మొదలవుతున్నా విద్యాసామగ్రి పూర్తిగా అందలేదు. 1392 పాఠశాలల్లోని 98 వేల మంది విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు 15 రోజుల క్రితమే పాఠశాలలకు చేరాయి. నోట్ పుస్తకాలు 6,51,038కి గాను 6,00,878 చేరాయి. బెల్ట్‌లు 61,338కి 60,821 అందుబాటులో ఉన్నాయి. యూనిఫామ్ 93,458కి 13,037, బ్యాగ్‌లు 93,548కి 44,812 చేరాయి. బూట్లు 95,586కి 41,547 మాత్రమే పాఠశాలలకు చేరాయి. డిక్షనరీలు లక్షా 17 పూర్తిగా వచ్చేశాయి.



ర్యాలీలో బొమ్మిడి, షరీఫ్, పొత్తూరి

అసభ్యకర వ్యాఖ్యలపై కూటమి నిరసన

నరసాపురం, జూన్ 11(ఆంధ్రజ్యోతి):అమరావతి మహిళలను కించపరుస్తూ సాక్షి మీడియాలో అసభ్యకర వ్యాఖ్యలను నిరసిస్తూ బుధవారం నరసాపురంలో కూటమి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, మైనార్టీ ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్, టీడీపీ ఇన్‌ఛార్జి రామరాజు, మత్స్యకార సహకార సంఘాల సమాఖ్య రాష్ట్ర చైర్మన్ కొల్లు పెద్దిరాజు పాల్గొన్నారు. మాజీ సీఎం జగన్, భారతిరెడ్డి మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. జక్కం శ్రీమన్నారాయణ, మైలా వసంతరావు, రాజ్యలక్ష్మి కొప్పాడ రవి పాల్గొన్నారు.

ఏరువాకా సాగారో..



విత్తనం చల్లి.. నాగలి పట్టి వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు పెదవేగి మండలంలో ఏరువాక ప్రారంభించారు. గణపవరం మండలంలో ఎమ్మెల్యే ధర్మరాజు నాగలితో దుక్కిదున్నారు. లోపలి పేజీలో..

రూ.18 కోట్ల అప్పులు

తీర్చే మార్గం కానరాక ఆత్మహత్యాయత్నం

5

ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈని బెదిరించిన వైసీపీ నాయకులు



అభివృద్ధికి అంకితం

కూటమి ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టి ఏడాది పూర్తయింది.. వైసీపీ ఐదేళ్ల పాలనలో విసుగెత్తిన ప్రజలు కూటమి ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.. తమను గెలిపించిన ప్రజల ఆశలు, ఆకాంక్షలు తీర్చే దిశగా జనం మెచ్చే విధంగా ఎమ్మెల్యేలు అడుగులు వేస్తున్నారు. తమ నియోజక వర్గాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు వెళుతున్నారు.. ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలోని ఎమ్మెల్యేలు నియోజకవర్గ అభివృద్ధిపై తమ అభిప్రాయాలను తెలియజేశారు..

(న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి)

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా

రఘురామకృష్ణరాజు, డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే



ఉండి నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నా. నియోజకవర్గంలోని పంట కాలువలు, మురుగు బోదెలను బాగు చేయించాను. ప్రజలకు సురక్షితమైన తాగునీరందించేందుకు రూ.5 కోట్లతో నియోజకవర్గంలో 25 మైక్రో ఫిల్టర్ బెడ్స్‌ను ఏర్పాటు చేయించా. ఆకివీడులో డయాలసిస్ సెంటర్, రూ.4 కోట్లతో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించాను.ఆకివీడులో అధ్వానంగా ఉన్న డంపింగ్ యార్డును పార్క్‌గా తీర్చిదిద్దాం. పంట కాలువలు కలుషితం అవ్వకుండా కాలువలను చేర్చి ఉన్న ఆక్రమణలను తొలగించడం, ట్రాఫిక్‌కు ఇబ్బందికరంగా ఉన్న రహదారులను వెడల్పు చేయించాం. సమస్య అనేదే లేకుండా నియోజకవర్గాన్ని తీర్చిదిద్దాలన్నదే నా ఆకాంక్ష.

పేదలకు టిడ్కో ఇళ్లు అందించడమే లక్ష్యం

పులపర్తి రామాంజనేయులు, భీమవరం ఎమ్మెల్యే



గ్రామాల్లో ఎన్‌ఆర్‌జీఎస్ ద్వారా రోడ్ల అభివృద్ధి చేశాం. కూటమి ప్రభుత్వ హయాంలో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తా. ఈ ఏడాది లో నియోజక వర్గంలో దాదాపు 24 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టా. ఇందులో ఎన్‌ఆర్‌జీఎస్ పథకంలో 9 కోట్లు, డ్రెయిన్ల అభివృద్ధికి 3 కోట్లు, రోడ్ల అభివృద్ధికి రూ. 2 కోట్లతో పనులు చేపట్టాం. ఎన్‌ఆర్‌జీఎస్ నిధుల ద్వారా మరిన్ని అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాం. పట్టణానికి సంబంధించి భీమవరంలో మూడు వంతెనలకు అప్రోచ్‌లు ఏర్పాటు చేసి వినియోగంలోకి తీసుకువచ్చాం. ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న డంపింగ్ యార్డు సమస్య పరిష్కరించాం. అర్హులైన పేదవారికి టిడ్కో ఇళ్లు అందించడం లక్ష్యంగా పెట్టుకున్నాం.

నియోజకవర్గమే నా కుటుంబం

నిమ్మల రామానాయుడు, పాలకొల్లు ఎమ్మెల్యే



పాలకొల్లు నియోజక వర్గమే నాకుటుంబం.వారి ఆశీసులతో మూడు మార్లు ఎమ్మెల్యే కాగలిగాను. మంత్రిగా ఉన్నప్పటికీ ప్రజా సేవకునిగా రోజులో 18 గంటలరు విశ్రాంతి లేకుండా పనిచేస్తున్నా.. పాలకొల్లును ఆదర్శ నియోజక వర్గంగా తీర్చిదిద్దడానికి ప్రాధాన్యం ఇస్తున్నా. పట్టణంలోని నిరుపేదల సొంత ఇంటి కల నెరవేర్చేందుకు టిడ్కో గృహాల నిర్మాణంతో పాటు పలు అభివృద్ధి పనులు 80 శాతం పూర్తి చేశాం. నియోజక వర్గం మొత్తంగా 100 కోట్లకు పైగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.ఎన్నికల్లో ఇచ్చినహామీలు అన్నింటిని నెరవేరుస్తూ అన్నివర్గాల ప్రజలకు సంక్షేమాన్ని, అభివృద్ధిని అందించేందుకు కృషి చేస్తున్నాం. కూటమి ప్రభుత్వ పాలనపట్ల అన్ని వర్గాల ప్రజలు సంతృప్తితో ఉన్నారు.

అన్ని రంగాల్లో నియోజకవర్గ అభివృద్ధి

చింతమనేని ప్రభాకర్, దెందులూరు ఎమ్మెల్యే



అభివృద్ధికి ఆమడ దూరంగా ఉన్న దెందులూరు నియో జకవర్గాన్ని ఏడాది కాలంలో అన్ని రంగాల్లోనూ అభివృద్ధి బాట పట్టించాం. అధ్వాన్నంగా ఉన్న రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి ఏడాది కాలంలోనే దాదాపు రూ.75 కోట్లు వెచ్చించి, రహదారులను అభివృద్ధి చేశాం. ఏలూరు నుంచి పెదపాడు మీదుగా పెరికీడు వెళ్లే 20 కిలోమీటర్ల రహదారిని రూ.30 కోట్లతో అభివృద్ధి చేశాం. రూ.14.84కోట్లతో నీటి సరఫరా విభాగం పనులు నిర్వహణ చేపట్టాం. రూ.16.25 లక్షలతో కొవ్వలిలో రూ.14 లక్షలతో కూచింపూడిలోని బాలుర వసతి గృహాలకు మరమ్మతులు నిర్వహించాం. నియోజకవర్గం వ్యాప్తంగా 200 గోకులం షెడ్ల నిర్మాణాలకు రూ.4.40 కోట్లు నిధులు అందించాం.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

బడేటి రాధాకృష్ణయ్య(చంటి), ఏలూరు ఎమ్మెల్యే



ప్రతీరోజు, అనునిత్యం ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకుని దాదాపు 80 శాతం సమస్యలు పరిష్కరించాం. 365 రోజులు కార్యాలయంలో అందుబాటులో ఉంటూ నిత్యం ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం. ఈ ఏడాది సుమారు రూ.9 కోట్లతో సీసీ రోడ్లు నిర్మించాం. మరో నాలుగున్నర కోట్ల ఆర్‌అండ్‌బీ నిధులతో నూజివీడు, ఏలూరు రోడ్డును నిర్మిస్తున్నాం. కూటమి ప్రభుత్వం వచ్చి రావడంతోనే పేదల కడుపు నింపేందుకు నగరంలో ఐదు అన్నా క్యాంటీన్లు ప్రారంభించాం. రూ.3 కోట్లతో ఐదు చెరువులను ఆధునీకరిస్తున్నాం. ఇప్పటికే పేదలకు 1500 ఇళ్ల నిర్మాణం పూర్తి చేశాం. మరో 3500 ఇళ్లు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాయి.రూ.15 కోట్లతో శనివారపుపేట కాజ్వే నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం.

నియోజకవర్గ అభివృద్ధే నా ధ్యేయం

ఆరిమిల్లి రాధాకృష్ణ, తణుకు ఎమ్మెల్యే



విధ్వంసం నుంచి అభివృద్ధి దశగా అడుగులు వేశాం. సంవత్సర కాలంలో నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టాం. ప్రధానంగా గోతుల రహదారులతో ఇబ్బందులు పడేవారు. ప్రతి గ్రామానికి పక్కా రోడ్డులు నిర్మించాం. నియోజకవర్గంలో 358.84 కోట్లుతో వివిధ శాఖల పరిధిలో పనులు చేపట్టాం. మార్చి15న ముఖ్యమంత్రి చంద్రబాబు తణుకు విచ్చేసినపుడు మునిసిపాలిటికి రూ.50 కోట్లు పనులకు ఆమోదం తెలిపారు. ప్రస్తుతం ఆయా పనులకు ప్రాజెక్టు రిపోర్టులు రూపకల్పనలో ఉన్నాయి. ఇరగవరం, అత్తిలి, తణుకు మండలాలకు సంబంధించి మరో రూ.50 కోట్లు పనులకు ఆమోదం తెలిపారు. నీతివంతమైన పాలనతో పాటు ప్రజా అవసరాలు తీర్చడానికి అధిక ప్రాధాన్యం ఇస్తాను.

ఏడాదిలో ఎంతో అభివృద్ధి


బొలిశెట్టి శ్రీనివాస్, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే



వైసీపీ పాలనలో నియోజకవర్గం అభివృద్ధిలో వెనకబడింది. కూటమి అధికారం చేపట్టిన ఏడాదిలోనే ఎన్నో అభివృద్ధి పనులు చేశాం. రూ.19 కోట్లతో 150 కిలోమీటర్ల మేర గోతులు పూడ్చాం. మాధవరం-అప్పారావుపేట, అప్పారావుపేట-జగన్నాధపురం, అప్పారావుపేట-వీరంపాలెం రహదారులు, పడమరవిప్పర్రు రహదారిని పూర్తి చేశాం. సగంలో ఆగిపోయిన ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ పీ4 విధానంలో ప్రజల సహకారంతో ముందుకు తీసుకు వెళుతున్నాం. పట్టణంలో జెడ్పీ స్కూల్ ప్రాంగణంలో దాతల సహకారంతో ఆటగాళ్ల కోసం గ్రౌండ్‌లు, వాకింగ్ ట్రాక్, స్టేజ్ నిర్మాణాన్ని చేపట్టాం. భవిష్యత్‌లో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తాం. కూటమి పాలనలో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారు.

ఆర్‌అండ్‌ఆర్ నిధులతో నిర్వాసితులకు మేలు

చిర్రి బాలరాజు, పోలవరం ఎమ్మెల్యే



పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు రూ.80 కోట్లు పెండింగ్ బకాయిలు ఇప్పించటంలో సంతృప్తి చెందా. వైసీపీ ప్రభుత్వంలో నిధులు విడుదల కాక నిర్వాసితులు ఇబ్బందులు పడ్డారు.కూటమి ప్రభుత్వం వచ్చాక నిధులు విడుదల చేయడంతో గిరిజనులకు ఎంతో మేలు జరిగింది. నియోజకవర్గంలో ఏడు మండలాల్లో రూ.20 కోట్ల నిధులతో ఆర్‌అండ్‌బీ , పీఆర్ , బీటీ రోడ్లను నిర్మించాం.రూ.35కోట్ల ఉపాధి నిధులతో సీసీ, గ్రావెల్ రోడ్ల నిర్మాణం చేశాం. నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారానికి జలజీవన్ మిషన్ ద్వారా 20 మంచినీటి ట్యాంకులు నిర్మాణం జరుగుతోంది. కొయ్యలగూడెంలో ఎప్పటి నుంచో దీర్ఘకాలిక సమస్యగా మిగిలిన డీగ్రీ, కళాశాల, ఫైర్‌స్టేషన్ మంజూరు చేయించాం.

కోకో సంబంధిత పరిశ్రమల ఏర్పాటుకు కృషి

సొంగా రోషన్‌కుమార్, చింతలపూడి ఎమ్మెల్యే



గ్రామాల్లో ప్రతీ శుక్రవారం గ్రామ సభలు నిర్వహించి ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తున్నా. ఇప్పటికే నాలుగు గ్రామసభలు నిర్వహించాం. ఇది పెద్ద నియోజకవర్గం. ఇంకా చేయాల్సిన పనులు ఉన్నాయి. ఫేజ్-1, ఫేజ్-2 ద్వారా పంచాయతీరాజ్ శాఖలో రోడ్లు, సీసీ రోడ్లు, గోతులకు మరమ్మతులు పూర్తి చేశాం. నియోజకవర్గంలో చింతలపూడి, జంగారెడ్డిగూడెం మునిసిపాలిటీలలో తాగునీరు, చెరువుల అభివృద్ధి, బ్యూటిఫికేషన్, సెంట్రల్ లైటింగ్ పనులపై దృష్టి పెట్టాం. ఈ ప్రాంతంలో కోకో పంట అధికంగా ఉంది. ఇందుకు సంబంధించిన పరిశ్రమలు పెట్టాలని పారిశ్రామికవేత్తలతో చర్చలు జరిపాం. వంద పడకల ఆసుపత్రి భవనాలు సెప్టెంబర్ నాటికి పూర్తి చేసి ప్రారంభిస్తాం.

ఎన్నికల హామీలపై దృష్టి

బొమ్మిడి నాయకర్, నరసాపురం ఎమ్మెల్యే



ఏడాది పాలన సంతృప్తినిచ్చింది. వైసీపీ హయాంలో అధ్వాన్నంగా మారిన రోడ్లను అభివృద్ధి చేశాం. రక్షిత మంచినీటి పథకాలను పటిష్ఠపర్చి శుద్ధి చేసిన నీటిని సరఫరా చేస్తున్నాం. సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.2 కోట్లు అందించాం. రూ.9 కోట్లతో ఎన్‌ఆర్‌జీఎస్ పనులు చేపట్టాం. ఎన్ని కల్లో ఇచ్చిన ప్రధాన హామీలైన వశిష్ఠ వారధి, హార్బర్‌లపై దృష్టి పెట్టాం. ఇప్పటికే సీఎం, డిప్యూటీ సీఎంల దృష్టికి తీసుకెళ్లాం. ఆక్వా యూనివర్శిటీని వచ్చే ఏడాదికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. దీర్ఘకాలంగా పెండింగ్‌లో వున్న కంపోస్టుయార్డు సమస్యను త్వరలోనే పరిష్కరిస్తాం. ఈ ఏడాది పాలనలోనే పెండింగ్ సమస్యలను కొలిక్కి తీసుకువచ్చాం నాలుగేళ్లలో వీటిని పూర్తి చేసే లక్ష్యంగా పనిచేస్తాం.

వారధి నిర్మించడమే నా కర్తవ్యం

పితాని సత్యనారాయణ, ఆచంట ఎమ్మెల్యే



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నియోజకవర్గంలో గోతులు లేని రహదారులను పూర్తిస్థాయిలో నిర్మించాం. రానున్న రోజుల్లో అన్ని గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీరు అందిస్తాం. ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించి ప్రజల సమస్యలను స్వీకరించాను. ప్రస్తుతం పల్లెపల్లెకు మన పితాని కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. ఆయా గ్రామాల్లో సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. పశ్చిమగోదావరి, కోనసీమ జిల్లాలను కలుపుతూ కోడేరు నుంచి గన్నవరం వరకు వారధి నిర్మించడమే నా లక్ష్యం. రానున్న రోజుల్లో ఆచంటను సమస్యలు లేని నియోకజవర్గంగా తీర్చిదిద్దుతాను.

నారాయణపురం వంతెన నిర్మాణానికి కృషి

పత్సమట్ల ధర్మరాజు, ఉంగుటూరు ఎమ్మెల్యే



ఏడాది పాలనలో తీసుకున్న నిర్ణయాలు సంతృప్తినిచ్చాయి. నియోజకవర్గంలోని ఉంగుటూరు, నిడమర్రు, గణపవరం, భీమడోలు మండలాల్లో పలు అభివృద్ధి పనులు నిర్వహించాం. రూ.56.83 కోట్లు వెచ్చించి 142.85 కి.మీ మేర రోడ్ల అభివృద్ధి చేశాం. రూ.17.35 కోట్లతో 35 రహదారుల మరమ్మతులు చేపట్టాం. సోషల్ వెల్ఫేర్ హాస్టళ్ల నాలుగింటికి రూ.14.53 లక్షలతో మరమ్మతులు చేయించాం. భీమడోలు హాస్టల్‌కు రూ.13.50 లక్షలతో మరమ్మతులు చేయిస్తున్నాం. 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.3.18 కోట్లతో 165 అభివృద్ధి పనులు చేశాం. నాబార్డు నిధులు నుంచి రెండు రహదారులకు రూ.2.45 కోట్ల మొత్తం వెచ్చించాం. భవిష్యత్తులో డెల్టా మెట్ట ప్రాంతాలను కలుపుతూ నారాయణపురం వంతెన నిర్మాణానికి కృషి చేస్తా.



కోకో గింజలను పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

రైతులకు అండగా ప్రభుత్వం

నాణ్యమైన పంటల దిగుబడిపై రైతులు దృష్టి పెట్టాలి

జానంపేటలో కోకో రైతుల సమస్యలు తెలుసుకున్న రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు

పెదవేగి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రైతుకు ఏ కష్టం వచ్చినా ప్రభుత్వం అండగా నిలుస్తుందని మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు అన్నారు. జానంపేటలో కోకో రైతుల సమస్యలను తెలుసుకున్నారు. జిల్లాలో కోకో రైతుల సమస్యలను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చిన వెంటనే సమావేశం ఏర్పాటుచేసి కోకో గింజలను కిలో రూ.500 ధరకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. వచ్చే ఏడాది నుంచి ఆయిల్‌పామ్‌కు గిట్టుబాటు ధర వంటి పాలసీని కోకో పంటకు కూడా అమలు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వ్యవసాయ శాఖ కార్యదర్శి బుడితి రాజశేఖర్ మాట్లాడుతూ రైతుల నుంచి కోకో గింజల కొనుగోలుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ కోకో రైతుల సమస్యలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం మిగిలిన పంట మొత్తాన్ని కొనుగోలు చేసిందన్నారు. వ్యవసాయశాఖ కమిషనర్ డిల్లీరావు, వ్యవసాయశాఖ కమిషన్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ వెట్రిసెల్వి, ఉద్యానశాఖ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు, దెందులూరు ఏఎంసీ చైర్మన్ గారపాటి రామసీత, వ్యవసాయశాఖ జేడీ హబీబ్ భాషా, ఉద్యానశాఖ డీడీ రామ్మోహన్, మైక్రో ఇరిగేషన్ పీడీ రవికుమార్, ఆర్డీవో అంబరీష్ పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే ధ్యేయంగా పీ-4

పేదరిక నిర్మూలనే ధ్యేయంగా పి4 పాలసీ దోహదపడుతుందని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. దుగ్గిరాలలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గొర్రెల కాపరి శ్రీను కుటుంబానికి పీ-4 విధానంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో కలిసి వంద గొర్రెలను మంత్రి అందించారు. వంద గొర్రెలను తీసుకున్న వ్యక్తి ఏడాది పాటు పెంచి వాటి సంతతిని తాను తీసుకుని, ఏడాది తరువాత వంద గొర్రెలను తిరిగి ఎమ్మెల్యేకు ఇస్తాడు. వాటిని మరొక వ్యక్తికి పీ-4 విధానంలో అందిస్తారు. ఇదే విధానాన్ని మిగిలిన వారు కొనసాగించాలని మంత్రి సూచించారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి, ఎమ్మెల్యే బడేటి చంటి, దెందులూరు ఏఎంసీ చైర్‌పర్సన్ గారపాటి రామసీత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు సోలార్ విద్యుత్

ఏలూరు రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాలకు సోలార్ విద్యుత్ సౌకర్యం కల్పించనున్నట్లు మంత్రి అచ్చెన్నాయుడు తెలినారు. ఏలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో రూ.35 లక్షలతో ఏర్పాటు చేసిన 50 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్ టాప్ సిస్టమ్‌ను ప్రారంభించారు. సోలార్ విద్యుత్‌కు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు.

సాఫీగా ఎస్జీటీల మాన్యువల్ కౌన్సెలింగ్

నేడు 900 మంది బదిలీ కౌన్సెలింగ్‌కు ఏర్పాట్లు



ఏలూరు అర్బన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : సాంకేతిక అవరోధాలతో తొలి రోజున అర్ధాంతరంగా నిలిచిపోయిన సెకండరీగ్రేడ్ టీచర్ల (ఎస్జీటీ)ల మాన్యువల్ కౌన్సెలింగ్ బుధవారం గాడిన పడింది. మంగళవారం రాత్రి వాయిదా పడిన ఎస్జీటీల బదిలీ కౌన్సెలింగ్ బుధవారం నిర్ణీత షెడ్యూలు ప్రకారమే జరిగింది. మధ్యాహ్నం ఒంటిగంటకు మొదలైన కౌన్సెలింగ్ తొలుత ఏలూరు నగరపాలకసంస్థ యాజమాన్యానికి చెందిన ఎస్జీటీలకు నిర్వ హించగా మొత్తం 166 మంది కోరుకున్న స్థానాలకు బదిలీ అయ్యారు. తదుపరి ఉమ్మడి జిల్లాలోని ఆరు మున్సిపాల్టీల ఎస్జీటీలకు నిర్వహించగా 264 మంది బదిలీని ఖరారు చేసుకున్నారు. ఆ వెంటనే సాయంత్రం నుంచి ఉమ్మడి జిల్లాలోని జడ్పీ/ఎంపీపీ యాజమాన్యాలకు చెందిన ఎస్జీటీలు 100 మందికి కౌన్సెలింగ్‌ను ప్రారంభించగా మధ్యలో ఒక గంటపాటు ప్రిఫరెన్షియల్ కేటగిరీ వినియోగంపై అభ్యంతరాలు వ్యక్తం కావడంతో, వాటిని పరిష్కరించిన అనంతరం రాత్రి ప్రారంభించారు. కాగా గురువారం ఉదయం 8.30 గంటల నుంచి సీనియార్టీ జాబితాలో సీరియల్ నంబరు 101నుంచి 900 వరకు స్లాట్‌కు 300 మంది చొప్పున కౌన్సెలింగ్ నిర్వహించాలని నిర్ణయించారు. ఎస్జీటీలు మొత్తం 2,239 మందికి కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉంది. డీఈవో వెంకటలక్ష్మమ్మ, పశ్చిమ గోదావరి జిల్లా డీఈవో నారాయణ, డీవైఈవోలు, ఎంఈవోలు, ఏడీలు, సూపరింటెండెంట్లు పర్యవేక్షించారు.

గోదావరి తీరంలో పట్టుబడిన గంజాయి



కుక్కునూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కుక్కునూరు మండలం వింజరం గోదావరి రేవుకి అవతలవైపు ఉన్న అల్లూరి జిల్లా కూనవరం మండలం పొలిపాక వద్ద గంజాయితో బుధవారం ఒక యువకుడు పట్టుబడ్డాడు. కుక్కునూరు మండలం వింజరం గోదావరి తీరంలో మత్స్యకారులు చేపలు పడుతూ ప్రయాణికులను పడవలో గోదావరి అవలతల వైపు చేర వేస్తుంటారు.ఈ క్రమంలో అవతల నుంచి పడవదాటి కుక్కునూరు మండలం వైపు రావడానికి ఓ యువకుడు పులిపాక రేవు వద్ద బ్యాగుతో వచ్చాడు. మత్స్యకారులు అనుమానంతో అతని బ్యాగు చెక్ చేయగా పార్శిల్ రూపంలో ఉన్న గంజాయి ఉంది. ఆ యువకుడు పారిపోయే ప్రయత్నం చేయగా మత్స్యకారులు పట్టుకుని కూనవరం పోలీస్‌లకు సమాచారం ఇవ్వడంతో వారు అదుపులోకి తీసుకున్నారు. మూడునెలల క్రితం తెలంగాణలోని బుర్గంపాడు వద్ద పోలీసులు జరిపిన వాహనాల తనిఖీల్లో భారీగా పట్టుబడిన గంజాయి కూడా కుక్కునూరు మండలంలోని గోదావరి తీరంలోనే రేవుదాటి వచ్చినట్లు సమాచారం ఉంది.

రిమాండ్ ఖైదీ మృతి



ఏలూరు క్రైం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : గంజాయి కేసులో అరెస్టు అయి రిమాండ్ ఖైదీగా జిల్లా జైలులో ఉన్న యువకుడు అనారోగ్యానికి గురై విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందాడు. గణపవరం మండలం చిన్న రామచంద్రాపురానికి చెందిన ఏళ్ళ సాయికిషోర్‌ను (27) గంజాయి కేసులో ఈనెల 7న గణపవరం పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు కోర్టుకు హాజరుపర్చగా రిమాండ్ విధించడంతో ఏలూరు జిల్లా జైలుకు తర లించారు. అప్పటి నుంచి జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. అతను వచ్చిన రెండు రోజుల తరువాత జ్వరం రావడంతో జైలుకు సంబంధించిన వైద్యులు పరీక్షించి మందులు ఇచ్చారు. అవి వేసుకున్నప్పటికీ జ్వరం తగ్గకపోవడం, మరింత నీరసించి పోవడంతో బుధవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో సాయికిషోర్‌ను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి పంపిం చారు. మధ్యాహ్నం వరకూ సాయికిషోర్‌కు వివిధ రకాల వైద్య పరీక్షలు చేయగా యూరిన్ క్రియేటిన్ ఎక్కువగా ఉందని, ఇన్‌ఫెక్షన్ కూడా ఉందని అతనికి సెరిబ్రల్ మలేరియా సోకినట్లుగా గుర్తించారు. అతను ఆసుపత్రిలోని కోమాలోకి వెళ్ళిపోవడంతో ఆక్సిజన్‌పై వైద్యం అందించి మెరుగైన చికిత్స కోసం విజయవాడకు తరలించారు. విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో మరణించాడు. అక్కడ కూడా వైద్య పరీక్షలు చేయగా సెరిబ్రల్ మలేరియా ఉన్నట్లుగా వైద్య పరీక్షల్లో గుర్తించారు. సాయికిషోర్ ఏజెన్సీ ప్రాంతంలో ఎక్కువగా ఉంటాడని చెప్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. వైద్యులు ఎమ్మెల్సీగా నమోదుచేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పాటు ఏలూరు జిల్లా జైలు సూపరింటెండెంట్ స్వామికి కూడా సమాచారం ఇచ్చారు.

మరోవైపు ఈ సంఘటనపై ఏలూరు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నారు.

రూ. 18 కోట్లు అప్పులు

తీర్చే మార్గం కానరాక ఆత్మహత్యాయత్నం

ఏలూరు క్రైం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : వడ్డీ వ్యాపారం చేస్తూ నష్టపోవడంతో అప్పులపాలయ్యాడు. వడ్డీ వ్యాపారం కోసం ఇతరుల వద్ద నుంచి తెచ్చిన 18 కోట్ల రూపాయలు బాకీ తీర్చేమార్గం కానరాక చివరకు వారి వేధిపులు భరించలేక పురుగుమంతు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఏలూరు శాంతినగర్‌లోని వీఎస్ఎల్ టవర్స్‌లో నివాసం ఉంటున్న విప్పగుంట అవినాష్‌కుమార్ (40) హైదరాబాద్‌లో ఒక ప్రైవేటు కంపెనీ నిర్వహించారు. మరో వైపు వడ్డీ వ్యాపారం చేశారు. వడ్డీ వ్యాపారానికి ఇతరుల నుంచి కూడా అప్పులు తీసుకువచ్చారు. తనకు ఉన్న ఆస్తులన్నీ ఇచ్చివేయగా ఇంకా 18 కోట్లు అప్పులు మిగిలాయి. వారి వేధింపులు భరించలేక హైదరాబాద్ నుంచి తిరిగి ఏలూరులోని శాంతినగర్‌కు కుటుంబంతో సహా వచ్చేశారు. 25 మందికి ఆయన సొమ్ములు ఇవ్వాల్సి ఉంది. వారంతా బాకీ కోసం ఒత్తిడి చేయడంతో బుధవారం బస్సులో బయలుదేరి కొవ్వూరువైపు వెళ్తూ మార్గమధ్యలో బుట్టాయిగూడెం వద్ద బస్సు దిగి పంట పొలాల్లో పురుగుమందు తాగి భార్యకు సమాచారం ఇచ్చాడు. దీంతో ఆమె బంధువులకు చెప్పడంతో అతనిని బుధవారం రాత్రి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదుచేసి ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈని బెదిరించిన వైసీపీ నాయకులపై కేసు నమోదు

నరసాపురం, రూరల్ జూలై 11 (ఆంధ్రజ్యోతి): నరసాపురం గ్రామీణ నీటి సరఫరా ఏఈ లోకేష్‌ను బెదిరించిన ముగ్గురు వైసీపీ నాయకులపై బుధవారం నరసాపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం ఏఈ లోకేష్ నరసాపురం మండలం వేములదీవి గ్రామంలోని సర్దుగడపలో మంచినీటి చెరువు రివిట్‌మెంట్ పనులు పరిశీలించేందుకు వెళ్లారు.ఆ సమయంలో పనులు ఆగిపోవడంపై ఏఈ ఆరా తీశారు. అదే సమయంలో అక్కడికి చేరుకున్న తిరుమాని నాగరాజు ఆయనతో వచ్చిన మరో ఇద్దరు విధుల్లో ఉన్న ఏఈపై బెదిరింపులతో పాటు దౌర్జన్యానికి పాల్పడ్డారు. ఏఈ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేశామన్నారు.

11 ఏళ్లలో దేశం అసాధారణ పురోగతి : ఎంపీ పాకా

ఏలూరు రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): భారతదేశం 11 ఏళ్లలో అనేక రంగాలలో అసాధరణ పురోగతి సాధించిందని రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణ అన్నారు. బీజేపీ పదకొండేళ్ల పాలనపై జిల్లా అధ్యక్షుడు సీహెచ్ విక్రమ్ కిశోర్ అధ్యక్షతన బుధవారం ఏలూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోదీ స్థిరమైన పాలనతో దేశాన్ని గాడిలో పెట్టారని వివరించారు.ఏలూరులో వందేభారత్‌కు హాల్ట్ కల్పించాలని, కోకో రైతులకు మద్దతు ధర వచ్చేలా కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర్యనారాయణరాజు, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు బి.నిర్మలా కిశోర్, సత్యనారాయణ, అశోక చక్రవర్తి, నెక్కంటి శ్రీని వాస్, కె.సుధాకర్ కృష్ణ, కట్నేని కృష్ణప్రసాద్ ఎంపీకి వినతిపత్రం అందించారు.



ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



తాడేపల్లిగూడెం అర్బన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమ మే ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, భవన, కార్మిక సంక్షేమ మండలి చైర్మన్ వలవల బాబ్జి అన్నారు. బుధవారం విజయవాడలో నిర్వహించిన గ్రీవెన్స్ సెల్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు.

క్షీరా రామస్వామికి జిల్లా రిజిస్ట్రారు పూజలు



పాలకొల్లు అర్బన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): స్థానిక క్షీరా రామలింగేశ్వర స్వామిని జిల్లా రిజిస్ట్రారు కె.శ్రీనివాసరావు బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు స్వామివారి శేషవస్త్రాన్ని, చిత్రపటాన్ని అందజేశారు.

ప్రభుత్వ ఏడాది పాలన

భేష్..

ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పాలన పూర్తయింది. అభివృద్ధి, సంక్షేమాన్ని సమపాళ్లలో ప్రభుత్వం ముందుకు తీసుకెళుతుందని తెలిపిన కొన్ని అభిప్రాయాలు ఇలా..

ఏడాది పాలన చాలా బాగుంది



ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పరిపాలన బాగుండడంతో ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చుతుంది. అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్ పెంచడం, తల్లికి వందనం, ఆగస్టులో ఫ్రీబస్సు పథకం పెట్టడంతో ప్రజల్లో మరింత ఉత్సాహం వచ్చింది. ఈ ప్రభుత్వంలో గొడవలు లేవు.

- షేక్ ఇస్మాయిల్ జానీ, ఆచంట

48 గంటల్లో ధాన్యం సొమ్ము జమ



నేను చిన్న రైతుని. గత పాలనలో ధాన్యం అమ్ముకున్న తరువాత డబ్బుల కోసం నెలల తరబడి ఎదురు చూసేవాళ్లం. ప్రస్తుత ప్రభుత్వంలో ధాన్యం అమ్మిన 48 గంటల్లో మా ఖాతాలలో సొమ్ములు జమ అవుతున్నాయి. పెన్షన్లు కూడా ఒకటో తేదీ నాటికి ఇస్తున్నారు. ప్రస్తుతం రేషన్ సరుకులు కూడా ఇబ్బంది లేకుండా తెచ్చుకుంటున్నాం.

- నక్కా చినవెంకట్రావు, పెంటపాడు

హామీలన్నీ ఒక్కొక్కటిగా అమలు



కూటమి నాయకులు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారు. ప్రజలు సంతృప్తిగా ఉన్నారు. రేషన్ సరుకులు ఇంటింటికి ఇవ్వడం మానివేసి షాపుల వద్ద ఇవ్వడం బాగుంది. అయితే షాపులు సమయానికి తెరిచేలా చూడాలి. 15 నెలలుగా ఎదురుచూస్తున్న వృద్ధాప్య పింఛన్లు త్వరగా మంజూరు చేయాలి.

- గొన్నాబత్తుల సత్యనారాయణ, పాలకొల్లు

రూ.30 కోట్లతో పైప్‌లైన్ పనులు



నియోజకవర్గంలోని 72 గ్రామాల్లో మంచి నీటి చెరువులు, పంట, మురుగు కాల్వల దగ్గర ఆక్రమణలు తొలగించి ప్రజారోగ్యాన్ని ఎమ్మెల్యే రఘురామ కాపాడుతున్నారు. తాగునీరుపై దృష్టి సారించారు. రూ.30 కోట్ల విలువైన మంచినీటి పైపులైను పనులు పునఃప్రారంభించడం అదృష్టం.

- చొప్పెర్ల శ్రీరామచంద్రమూర్తి, ఆకివీడు

డంపింగ్ యార్డు తొలగించారు



ఆకివీడులో ఏళ్ల తరబడి ఊరి మధ్యలో, ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో ఉన్న డంపింగ్‌యార్డును తొలగించి ఎమ్మెల్యే రఘురామ సత్తా చాటారు. ప్రజా అవసరాల నిమిత్తం సమస్యలు పరిష్కరిస్తున్నారు. పాఠశాలలు, ఆసుపత్రులు, పార్కులు, బస్టాండ్లను అభివృద్ధి చేస్తున్నారు.

- భమిడిపాటి శ్రీనివాసరావు, వ్యాపారి, ఆకివీడు

రాష్ట్రానికి రాజధాని ఏర్పడింది



గత ప్రభుత్వ హయంలో రాష్ట్రానికి రాజధాని ఎక్కడంటే చెప్పలేని పరిస్థితి. మూడు రాజధానులు అని చెప్పుకోవాల్సి వచ్చింది. నేడు ఆ పరిస్థితి లేదు. ఏపీ రాజధాని అంటే అమరావతి అని గట్టిగా చెప్పగలుగుతున్నాం. రాజధాని నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతుండటం, రాష్ట్రంలో అభివృద్ధి మొదలైందనే భావన ప్రజల్లో నెలకొంది.

- ఎన్.శరత్, నరసాపురం

అభివృద్ధి సంక్షేమంతో పాలన



రాష్ట్రంలో ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే రెవెన్యూ లోటు ఉన్నప్పటికి అభివృద్ధి, సంక్షేమ పాలన సాగుతోంది. వృద్ధాప్య, వితంతు, దివ్యాంగుల పింఛన్లను పెంచి నెలలో మొదటి తేదీనే ఇంటి వద్ద అందజేస్తున్నారు. రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణ పనులు వేగంగా చేపట్టారు. పోలవరం ప్రాజెక్టు పనులు వేగంగా పెరిగింది.

- చుండ్రు రామ్మోహన్, రైతు, మండపాక

కూటమి పాలన బాగుంది



కూటమి ప్రభుత్వం పాలన చాలా బాగుంది. ఏ విధమైన ఇబ్బందులు లేకుండా ఎవరి వృత్తిలో వారు సాఫీగా వెళ్లడానికి ప్రభుత్వ సహకారంగా ఉంటుంది. గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేసింది. పథకాల అమలులో కూడా ఒక్కొక్కటిగా అమలు చేస్తూ అర్హులైన అందరికి పథకాలు అందుతున్నాయి.

- కౌరు యుగంధర్, దిరుసుమర్రు

గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం : ఆరిమిల్లి



చందును అభినందిస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి

అత్తిలి/తణుకు రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఎన్నికల్లో కూటమికి 70 శాతంకు పైగా ఓట్లు పోలైన ప్రాంతాల్లో అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తామని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. బుధవారం అత్తిలిలో పార్టీ మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అత్తిలి నుంచి 2013లో రాజకీయ ప్రస్థానం ప్రారంభమైందన్నారు. అత్తిలి మండలం తనకు సెంటిమెంట్ అని, 2024 ఎన్నికల్లో 17వేల ఓట్ల మెజార్టీ సాధించామని, దాదాపు 65శాతం ఓట్లు అత్తిలి మండలం ప్రజలు ఆదరించారని చెప్పారు. అత్తిలి మండల పార్టీ అధ్యక్షుడిగా పోలిశెట్టి చందు, కార్యదర్శిగా అల్లి అజయ్‌కుమార్‌లను ఎన్నుకు న్నారు. తణుకు నియోజక వర్గ పరిశీలకులుగా యర్రా వేణుగోపాలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

తేతలిలో సీసీ రోడ్డు ప్రారంభం..

గత ప్రభుత్వ పాలనలో నిర్లక్ష్యానికి గురైన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతస్తుందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ తెలిపారు. బుధవారం తేతలి గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.10లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ సరెళ్ల క్రాంతిప్రియ, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

'ఉండి'లో సీసీ కెమెరా నెట్‌వర్క్ ఏర్పాటుకు నిర్ణయం



బీసీఎన్ అధినేత శ్రీనివాసరాజుకి చెక్కు అందిస్తున్న రఘురామ

కాళ్ల/పాలకోడేరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ఉండి నియోజకవర్గం మొత్తం సీసీ కెమెరా నెట్‌వర్క్ పెట్టేందుకు నిర్ణయం తీసుకున్నామని, ప్రజలందరూ సహకరించి ముందుకు వచ్చారని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. కాళ్ల మండలం పెద అమిరంలో బుధవారం భీమవరం డీఎస్పీ జయసూర్య, సీఐ, ఎస్‌ఐలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ ప్రాజెక్టుకు భీమవరం కేబుల్ నెట్‌వర్క్ (బీసీఎన్) అధినేత శ్రీనివాసరాజును టెక్నికల్ సపోర్ట్ ఇవ్వాలని కోరామన్నారు. త్వరలో మనమే ఒక ఓన్ నెట్‌వర్క్ క్రియేట్ చేసుకుని ఉండి, ఆకివీడు, కాళ్ల మండలాలకు ఒక రింగ్, తర్వాత పాలకోడేరును కలుపుతూ మరో రింగ్ మొత్తం 150 కిలోమీటర్ల లైన్ ఫైబర్‌ను తీసుకుంటామన్నారు. దీనిలో భాగంగా అడ్వాన్స్‌గా రూ. 9.50 లక్షలను ఉండి ఇన్‌ఫాస్ట్రక్చర్ ఫండ్ నుంచి బీసీఎన్ అధినేత శ్రీనివాసరాజుకి అందిస్తున్నామన్నారు. క్రైం రేటు తగ్గించడానికి ఇంతకు మించిన మార్గం లేదన్నారు.

- పాలకోడేరు మండలంలోని మంగయ్య చెరువు గట్టు, కొత్త కాలనీలో సుమారు రూ. 20లక్షలతో ఏర్పాటు చేసిన సీసీ రహదారులను డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు ప్రారంభించారు. సర్పంచ్ ఇంజేటి మరియమ్మ, నీటి సంఘం డెల్టా ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కునాథరాజు మురళీకృష్ణంరాజు, కొత్తపల్లి నాగరాజు, కొత్తపల్లి సూర్యనారాయణరాజు, గాదిరాజు శ్రీనివాసరాజు, గుత్తుల ఏడుకొండలు, దొంగ కృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

శ్రీసత్యసాయి రథానికి ఘన స్వాగతం

పాలకొల్లు అర్బన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి) : భగవాన్ శ్రీసత్యసాయి బాబా శత జయంతి సందర్భంగా శాంతి రథం జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం పాలకొల్లుకు చేరుకుంది. రథానికి గాంధీ బొమ్మల సెంటర్‌లో భగవాన్ సత్యసాయి భక్తులు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడ నుంచి నగర సంకీర్తనగా లాకుల మీదుగా భీమవరం రోడ్డుకు లజపతిరాయ పేటలోని నాలుగో వీధిలో గల శ్రీసత్యసాయి సేవా సమితికి రథం చేరింది. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేకంగా కలిదిండి బంగారమ్మ, సూర్యనారాయణ దంపతులు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి హారతులు ఇచ్చారు. జిల్లా ప్రెసిడెంట్ కె.రవీంద్ర, నరసాపురం జోన్ ఇన్‌చార్జి పి.వేణుగోపాలరాజు, పాలకొల్లు కన్వీనర్లు ఉండపల్లి రామకృష్ణ, అమ్మాజీ, ఎల్‌ఆర్‌పేట సమితి కన్వీనర్ నందూరి జానకీరామయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, భక్తులు పాల్గొన్నారు.

రక్తపోటు నివారణపై అవగాహన ర్యాలీ

నరసాపురం టౌన్/తాడేపల్లిగూడెం రూరల్/గణపవరం/భీమవరం క్రైం, 11(ఆంధ్రజ్యోతి): రక్తపోటు నివారణపై బుధవారం నరసాపురం పట్టణ వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ ప్రాంతం నుంచి శివాలయం సెంటర్ వరకు సాగింది. వైద్యులు డాక్టర్ మోహన రవిరాజా, డాక్టర్ రంజిత్‌కుమార్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. తాడేపల్లిగూడెం రూరల్ వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో డాక్టర్ శ్రీహర్ష నేతృత్వంలో ప్రపంచ రక్తపోటు దినోత్సవం అవగాహన ర్యాలీ నిర్వహించారు. గణపవరం మండలం గణపవరం, పిప్పర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ర్యాలీలో గణపవరం ప్రభుత్వ వైద్యాధికారులు కిరణ్మయి, ఓంకార్‌నాథ్, పిప్పర వైద్యాధికారి ప్రియాంక, ఐ.శ్రీదివ్య, ఎంపీహెచ్‌వోలు విల్సన్‌బాబు, వెంకటేశ్వర్లు, వైద్య, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు. భీమవరం జంక్షన్ రైల్వే స్టేషన్‌లో బీపీ వల్ల వచ్చే నష్టాలు, కంట్రోల్ చేసుకునే విధానాలపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎన్‌సీడీప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ధనలక్ష్మి, జి.సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే మంత్రం

(3వ పేజీ తరువాయి)

మరో రూ.80 కోట్లు నిధులు మంజూరయ్యాయి. తాడేపల్లి గూడెంలో విమానాశ్రయ నిర్మాణానికి ప్రభుత్వం ప్రతిపాదిం చి సాధ్యాసాధ్యాలు, అవసరాలను పరిశీలిస్తోంది. మరోవైపు ఆకివీడు నుంచి దిగమర్రు వరకు 165 జాతీయ రహదారిని నాలుగు లైన్‌లుగా ప్రతిపాదించారు. కేంద్ర మంత్రి మండలి ఆమోదం తర్వాత టెండర్లు పిలిచి జాతీయ రహదారి ప్రాజెక్ట్‌ను పూర్తి చేయనున్నారు. లోసరి నుంచి భీమవరం మీదుగా తాడేపల్లిగూడెం రహదారి అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం రూ.100 కోట్లు మంజూరు చేసింది. ఏడాది పాలనలో మునిసిపాలిటీలు, పంచాయతీ లకు ఆర్థిక స్వేచ్ఛ లభించింది. మునిసిపాలిటీలు తమ నిధులను నేరుగా వెచ్చించుకునే వెసులుబాటు కల్పించారు. పంచాయతీల్లో దాదాపు రూ.60 కోట్లతో ఉపాధి పనులు చేపట్టారు. రహదారులు అభివృద్ధి చేశారు.

తాగునీరు, కాల్వలపై దృష్టి

గోదావరి జలాలను శుద్ధిచేసి నేరుగా పల్లెలకు అందించే వాటర్ గ్రిడ్‌కు దాదాపు రూ.1400 కోట్లతో కూటమి ప్రభుత్వంలో ముందడుగు పడింది. విజ్జేశ్వరం వద్ద ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణానికి అవసరమైన పనులు చేపడుతున్నారు. పశ్చిమ డెల్టా సాగు పంట కాలువలు, డ్రెయిన్‌ల మరమ్మతులు, పూడిక తొలగింపు పనులు రూ.40 కోట్లతో చేపడుతున్నారు. జిల్లాలో కొత్త రైల్వే ప్రాజెక్టులు మంజూరయ్యాయి. నరసాపురం నుంచి మచిలీ పట్నం వరకు కొత్త రైల్వే మార్గానికి డీపీఆర్ సిద్ధం చేయాలని రైల్వే శాఖ ఆదేశించింది. నరసాపురం-కోటిపల్లి రైల్వే మార్గానికి అడుగులు పడ్డాయి. తాడేపల్లిగూడెం నుంచి విజయవాడ, విశాఖపట్నం వైపు ప్రధాన రైలు మార్గంలో గ్రామాల వద్ద ఆర్‌వోబీలను కేంద్రం మంజూరు చేసింది. భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురం రైల్వే స్టేషన్లను అధునాతనంగా తీర్చిదిద్దుతుతున్నారు.

దాతల సహకారంతో అభివృద్ధి

నియోకవర్గాల్లో ప్రభుత్వ నిధుల కోసం ఎదురు చూడ కుండా దాతల సహకారంతో ప్రజాప్రతినిధులు అభివృద్ధి పనులు చేస్తున్నారు. ఉండి నియోకవర్గం అన్నిటికంటే ముందుంది. డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజు విరాళాలు సేకరించి అభివృద్ధి చేయడంలో శ్రమిస్తున్నారు. తాడేపల్లిగూడెంలో ఇండోర్ స్టేడియం, కాలువ పనులు, స్విమ్మింగ్ పూల్ పనులకు ఎమ్మెల్యే బొలిశెట్టి దాతలను సమీకరించి అభివృద్ధి చేపడుతున్నారు. భీమవరంలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు ఎమ్మెల్యే అంజిబాబు దాతలను సమీకరిస్తున్నారు.



శృంగవృక్షంలో రికార్డులు తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో గీతాబాయి

శిశు,మాతృ మరణాలు లేకుండా చూడాలి

పాలకోడేరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ శిశు, మాతృ మరణాలు లేకుండా చూసి ప్రజలకు ఆరోగ్యాన్ని అందించాలని జిల్లా వైద్యాధికారి గీతాబాయి సూచించారు. బుధవారం శృంగవృక్షంలో ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఆరోగ్య విషయంలో మంచి వైద్యం అందించాలన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే సహించేది లేదన్నారు. సమయానికి అందుబాటులో ఉంటూ గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు అందించాలన్నారు. వీరవాసరం పీహెచ్‌సీ ఇన్‌ఛార్జి డాక్టర్ గులాబ్ రాజ్‌కుమార్, వైద్యసిబ్బంది ఉన్నారు.

కేఎంపీఎల్ సాధనలో భీమవరం డిపో ఫస్ట్

భీమవరంటౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ సంస్థలో రాష్ట్రంలోని 129 డిపోల్లో అత్యధిక కేఎంపీఎల్ సాధించి భీమవరం డిపో ప్రథమ స్థానం సాధించింది. ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారాక తిరుమలరావు డిపో మేనేజర్ పీఎస్‌వీ ఎం.సత్యనారాయణమూర్తిని అభినందిస్తూ ప్రశంసాపత్రాన్ని పంపించారు. ఈ పత్రాన్ని బుధవారం రాత్రి భీమవరం ఆర్టీసీ గ్యారేజీలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో జిల్లా ప్రజా రవాణాధికారి ఎన్‌వీఆర్ ప్రసాదరావు అభినందిస్తూ లేఖను అందించి, అభినందించారు.

'పది ఆసనాలతో మెదడు పనితీరు మెరుగు'

భీమవరంటౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పది ఆసనాలు మెదడు పనితీరును మెరుగుపరుస్తాయని సీఎస్ఎన్ కళాశాల కార్యదర్శి డాక్టర్ చీడే సత్యనారాయణ, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సత్యనారాయణ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో బుధవారం సీఎస్ఎన్ కళాశాలలో యోగా దినోత్సవ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈనెల 17న సీఎస్ఎన్ కళాశాలలో జిల్లా అధికారుల పిలుపుమేరకు యోగా ప్రదర్శనలు, శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. అనంతరం నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి మాట్లాడారు. వడుపు గోపి, ఎం.డి. సలీంఖాన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా దేవలమను బ్రహ్మాస్వామి జయంతి

నరసాపురంటౌన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని 12 వార్డులో బుధవారం చౌడేశ్వరి దేవి, దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దేవలమనుబ్రహ్మాస్వామి జయంతిని ఘనంగా నిర్వహించారు. జ్యేష్ఠమాసం పౌర్ణమి రోజున మహర్షి జయంతి జరుపుకోవడం దేవాంగులకు ఆనవాయితీ, దానిలో భాగంగా పూజలు చేసి అన్నసమారాధన నిర్వహించారు. కార్పొరేషన్ డైరెక్టర్ మావూరి చిన్న సత్యనారాయణ, గోరు సత్తిబాబు, కనకం ప్రసాద్ బూడిద జోగేశ్వరరావు, రమేష్, భవాని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్ర రాష్ట్రస్థాయి పోటీలకు 'భవిష్య' ఎంపిక

ఇరగవరం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర-25 రాష్ట్రస్థాయి పోటీలకు ఇరగవరం మండలం తూర్పువిప్పర్రు గ్రామానికి చెందిన దొండమూరి భవిష్య ఎంపికైనట్లు ఎంపీడీవో ఎ.శ్రీనివాసు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. యోగాంధ్ర-25 కార్యక్ర మంలో భాగంగా భీమవరంలోని అల్లూరి సీతారామరాజు సాంస్కృ తిక కేంద్రంలో జరిగిన జిల్లాస్థాయి యోగా పోటీల్లో పది నుంచి పద్దెనిమిదేళ్ల విభాగంలో యోగసనాల్లో ద్వితీయ స్థానం, సూర్య నమస్కారాల్లో తృతీయ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైందన్నారు. ఈ సందర్భంగా చిన్నారిని గ్రామ పెద్దలు, అధికారులు అభినందించారు.

ఉప్పుటేరులో వేటకెళ్లిన మత్స్యకారుడు మృతి

మొగల్తూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఉప్పుటేరులో వేటకువెళ్లిన ఓ మత్స్యకారుడు మృతి చెందాడు. పేరుపాలెం నార్త్ గ్రామంలోని నెల్లిపల్లవపాలెం వెళ్లిన తిరుమాని రామకృష్ణ(37) గ్రామంలోని ఉప్పుటేరులో మంగళవారం రాత్రి చేపల వేటకు వెళ్లాడు. బుధవారం ఉదయానికి తిరిగి రాకపోవడంతో స్థానికులు గాలించగా ఉప్పుటేరులో శవమైతేలాడు. కుటుంబ సభ్యులు ఫిర్యాదుతో ఘటనా ప్రాంతానికి మొగల్తూరు పోలీసులు వెళ్లి దర్యాప్తు చేపట్టారు.

బ్లేడ్‌తో దాడి చేసిన వ్యక్తికి 14 రోజుల రిమాండ్

ఆకివీడు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పోలీస్ లాకప్‌లో ఉన్న వృద్ధుడిని బ్లేడుతో దాడి చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. ఈనెల మూడో తేదీన సంతమార్కెట్‌లో ఓ పాపను వృద్ధుడు అత్యాచారం చేశాడని తండ్రి ఫిర్యాదు మేర పోలీసులు అదుపులోకి తీసుకొని లాకప్‌లో పెట్టారు. బాలిక మేనమావ సత్యవాడ కిరణ్‌కుమార్ లాకప్‌లో ఉన్న వృద్ధుడిపై బ్లేడుతో దాడి చేసిన సంగతి తెలిసిందే. బుధవారం కిరణ్‌కుమార్‌ను తన నివాసంలో అరెస్టు చేసి కోర్టుకు తరలించగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.

నలుగురు పాత నేరస్తుల బైండోవర్

భీమవరం క్రైం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): భీమవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో బుధవారం నలుగురు పాత నేరస్తులను బైండోవర్ చేశారు. బస్వా అశ్వినికుమార్, చిలుకూరి శ్రీను, కట్టా సత్యనారాయణ, పుచ్చకాయల నారాయణ అనే నలుగురు పాత ముద్దాయిలను భీమవరం తహసీల్దార్ వద్ద బైండోవర్ చేశామని ఎక్సైజ్ సీఐ కె.బలరామరాజు తెలిపారు.

రైతులకు ఆసరాగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు : ఎమ్మెల్యే పత్సమట్ల



సీహెచ్ అగ్రహారంలో దుక్కు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

గణపవరం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): రైతులకు ఆసరాగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. ఏరువాక పౌర్ణమి పురస్కరించుకుని మండలంలో సీహెచ్.అగ్రహారంలో ఏరువాక సాగాలిరో అన్నో చిన్నన్న.. అంటూ రైతుల్ని అధికారుల్ని, కూటమి సభ్యుల్ని ఆనందంలో ముంచెత్తించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వర్షాలు సమృద్ధిగా కురవాలని రైతులంతా పంటలు అధిక దిగుబడులు సాధించాలని కోరుకుంటున్నామన్నారు. ప్రతీ ఏటా జ్యేష్ఠ శుద్ధపౌర్ణమి రోజున ఏరువాక పౌరణమి పండుగ జరుపుకోవడం శుభపరిణామం అన్నారు. పొలాల్లోకి వెళ్లి ట్రాక్టర్ ద్వారా భూమి దుక్కిదున్నడం ప్రారంభించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో 2.08లక్షల ఎకరాల్లో వరిసాగు చేస్తున్నామన్నారు. తాడేపల్లిగూడెం ఏడీఏ మురళీకృష్ణ, ఏవో వైవీఎస్.ప్రసాద్, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్లు ఇందుకూరి రామకృష్ణంరాజు, పొత్తూరి వాసురాజు, యాళ్ల సుబ్బారావు, టీడీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

సేవా దృక్పథంతో నూతన కమిటీ పనిచేయాలి : నాయకర్

నరసాపురం టౌన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): రోగులకు, ఆస్పత్రి అభివృద్ధికి నూతన కమిటీ సేవా దృక్పథంతో పనిచేయాలని విప్ నాయకర్ పిలుపునిచ్చారు. బుధవారం ఏరియా ఆస్పత్రిలో ఆస్పత్రి కమిటీ ప్రమాణ స్వీకారానికి ముఖ్య అతిథిగా ఆయన విచ్చేశారు. కమిటీ సభ్యులు మాదంశెట్టి కోటేశ్వరరావు, కాగిత వెంకటేశ్వరావు, సంకరపు వెంకటేశ్వరావు, పోలిశెట్టి నళిని, సతీష్‌కుమార్, రాజుబాబు, డాక్టర్ ప్రసాద్‌ల చేత సూపరింటెండెంట్ సుప్రియ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం విప్ నాయకర్ మాట్లాడుతూ ఆస్పత్రి స్థాయి పెంచి ఆధునిక వైద్యసౌకర్యాలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తామన్నారు. త్వరలో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం కొత్త కమిటీని పలువురు అభినందించారు. ఎంప షరీఫ్, పొత్తూరి రామరాజు, పి.సాంబ, సోడదాసి శ్రీధర్, రవీంద్ర, ఆకన చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నేటి నుంచి హాస్టళ్లకు సన్నబియ్యం సరఫరా : జేసీ



సన్న బియ్యం క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తున్న జేసీ

పెనుమంట్ర జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల పునఃప్రారంభం గురువారం నుంచి పురస్కరించుకుని ప్రతి విద్యార్థికి ఫైన్ రైస్ ఇవ్వాలని ఉద్దేశంతో 1,423 స్కూళ్లకు 75 ఎస్సీ ఎస్టీ బీసీ వెల్ఫేర్ హాస్టళ్లకు 25 కేజీల సన్న బియ్యం బ్యాగులను సరఫరా చేశామని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం పాలమూరు ఎస్సీ బాలుర వసతి గృహాన్ని, మార్టేరు వేణుగోపాలస్వామి జడ్పీ ఉన్నత పాఠశాలలో సూపర్ ఫైన్ రైస్ సరఫరా నిల్వలపై తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మంత్రి లోకేశ్ ఆదేశాల మేరకు బాపట్ల జిల్లా రేపల్లె నుంచి సన్నబియ్యం సూపర్ ఫైన్ వెరైటీ రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని మిల్లుకు తరలించి సన్న బియ్యం టెక్నికల్ సర్టిఫికెట్ ఆమోదం పొందిన అనంతరం 80 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని అందించేందుకు బియ్యాన్ని ఆయన పరిశీలించా మన్నారు. క్యూఆర్ కోడ్ సిస్టం ద్వారా సూపర్ ఫైన్ వెరైటీ పండించిన రైతు, బియ్యం ఆడిన రైస్‌మిల్, బియ్యాన్ని నాణ్యతను సర్టిఫై చేసిన అధికారి వివరాలు తెలిపారు. సివిల్ సప్లై మేనేజర్ టి.శివరాం ప్రసాద్, తహసీల్దార్ వై.రవికుమార్, హెచ్‌ఎం సత్యనారాయణరెడ్డి, హాస్టల్ వార్డెన్ సూర్యనారాయణ, ఎంఈవో ఉంగరాల నాగేశ్వరరావు, సుబ్బారావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అమ్ముకుంటున్నారని ఎస్ఎఫ్ఐ ధర్నా

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం పట్టణంలో విద్యను వ్యాపారం చేస్తున్నారని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం నారాయణ స్కూల్ వద్ద ధర్నా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ నాయకులు ఎస్.లక్ష్మణ్ మాట్లాడుతూ పట్టణంలోని విద్యా సంస్థలు విద్యాసామగ్రి అమ్ముకుంటూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు దోచుకుంటున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ నాయకులు నాగేంద్ర బాబు, టి.రవిబాబు, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ ఫెయిలైన విద్యార్థులకు స్పెషల్ డ్రైవ్

పాలకొల్లు అర్బన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ వర్సిటీ స్థాయిలో 2012 నుంచి 2019 వరకు డిగ్రీ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు యూనివర్శిటీ ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు చాంబర్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. సంబంధిత నోటిఫికేషన్ విడుదల అయ్యిందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పాత పరీక్షల విధానం ప్రకారం ఇయర్ ఎండ్, సెమిస్టర్ విధానం, సీబీసీఎస్ పద్ధతుల్లో పరీక్షలు జరుగుతాయని ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు సూచించారు.

ఆబోతుల పోట్లాట.. పరుగులు తీసిన ప్రయాణికులు

ఆకివీడు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ఆబోతులు పోట్లాడుకోవడంతో బస్టాండ్‌లో ప్రయాణికులు భయాందోళన చెందారు. బుధవారం స్థానిక ఆర్టీసీ కొత్త బస్టాండ్‌లోకి బస్సు వచ్చే సమయంలో రెండు ఆబోతులు ఆ ప్రాంతంలో తీవ్రంగా పొడుచుకోవడంతో భయాందోళనతో ప్రయాణికులు పరుగులు తీశారు. పశువులను కొందరు రోడ్లపైకి వదిలేస్తుండడంతో అవి ఇష్టానుసారంగా తిరుగుతూ ప్రజానీకాన్ని భయాందోళనకు గురి చేస్తున్నాయి. నగర పంచాయతీ అధికారులు వాటిని నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

'బడిఈడు పిల్లలను బడిలో చేర్పిద్దాం'

భీమవరం రూరల్/ఆచంట/పాలకొల్లు అర్బన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): బడిఈడు పిల్లలను బడిలో చేర్పిద్దామని భీమవరం ఎంపీడీవో నూకల మురళీ గంగాధరరావు అన్నారు. భీమవరం ఎంపీడీవో కార్యాలయం వద్ద బుధవారం శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలంటూ ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో గంగాధరరావు మాట్లాడుతూ ఆరు నుంచి పద్నాలుగు ఏళ్లలోపు వయస్సు గల బడిఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ఎంఈవో జి.శ్రీనివాస్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఆచంటలో బడిబాట కార్యక్రమం ఎంఈవో పి. రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. చిన్నారులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరుతూ వినూత్నంగా మైక్ ప్రచారం నిర్వహించారు. పాలకొల్లు పట్టణం, మండలం, యలమంచిలి మండలాల్లోని అన్ని ప్రభుత్వ పాఠశాలు గురువారం నుంచి తెరుచుకుంటాయని ఎంఈవో ఆర్‌వీఎస్ఎస్ గంగాధర శర్మ బుధవారం తెలిపారు.



వద్దిపర్రులో సైకిల్‌యాత్ర చేస్తూ రోడ్డును పరిశీలిస్తున్న విజయభాస్కర్, నాయకులు

రైతులకు బాసటగా ప్రభుత్వం : విజయభాస్కర్

పోడూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): రైతులకు అన్ని విధాలుగా కూటమి ప్రభుత్వం బాసటగా నిలుస్తుందని పాలకొల్లు ఏఎంసీ చైర్మన్ కోడి విజయభాస్కర్ అన్నారు. వద్దిపర్రు గ్రామంలో నక్కలకాలువ వెంబడి రూ.37లక్షలతో నిర్మించిన గ్రావెల్ రోడ్డును బుధవారం పాలకొల్లు డీసీ చైర్మన్ పెన్మెత్స రామభద్రరాజు, కూటమి నాయకులతో కలిసి ఆయన సైకిల్‌యాత్ర చేస్తూ రోడ్డును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మంత్రి రామానాయుడు మంజూరు చేసిన సుమారు రూ.99 లక్షలతో నియోజకవర్గంలో రైతాంగానికి చెందిన పలు అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. సర్పంచ్ వడ్లపాటి రాజేంద్రప్రసాద్, ఎంపీటీసీ విప్పర్తి శారద, మాజీ సర్పంచ్ రావి స్వర్ణసింగ్, టీడీపీ గ్రామ అధ్యక్షుడు సిద్దాని మోక్షగణపతి, కార్యదర్శి ఖండెల్లి శ్రీను, నీటిసంఘం నాయకులు అందే కోటివీరభద్రం పాల్గొన్నారు.

17న క్రికెట్ ఎంపిక పోటీలు

ఏలూరు రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : భీమవరం డీఎన్నార్ కళాశాల మైదానంలో ఈనెల 17వ తేదీన అండర్-16 పురుషుల క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్టు కమిటీ సభ్యులు ఆర్ఎస్ఆర్ మూర్తి, అశోక్‌కుమార్ గౌడ, షేక్ షాకీర్ హస్సేన్ తెలిపారు. ఉదయం 9 గంటలకు ఎంపిక పోటీలు జరుగుతాయని, ఎంపికైన క్రీడాకారులు జూలై మూడు నుంచి పదమూడో తేదీ వరకు మంగళగిరిలో ఆంధ్రక్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే సెంట్రల్ జోన్ ఇంటర్ డిస్ట్రిక్ట్ పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. క్రీడాకారులు తెల్లటి యూనిఫాం, సొంత క్రికెట్ కిట్టుతో హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. వివరాలకు 90002 44892 నంబరులో సంప్రదించాలన్నారు.



ఆలయం వద్ద అన్నసమారాధన చేస్తున్న వెలమ యువజన సంఘం సభ్యులు

గౌరీదేవి అమ్మవారికి పూజలు

పెంటపాడు, జూన్ 11(ఆంధ్రజ్యోతి) : పౌర్ణమి సందర్భంగా పెంటపాడు వెలమ యువజన సంఘం ఆధ్వర్యంలో గౌరీదేవి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, కుంకుమ పూజలు జరిపారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఏర్పాట్లను వెలమ యువజన సంఘం సభ్యులు పర్యవేక్షించారు.

సీపీఐ మండల కార్యవర్గం ఎన్నిక

పెంటపాడు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ నిరంతరం పోరాటం చేస్తుందని సీపీఐ మండల కార్యదర్శి కళింగ లక్ష్మణరావు అన్నారు. పెంటపాడు సీపీఐ మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా బుధవారం ఎన్నుకున్నారు. కార్యదర్శిగా కళింగ లక్ష్మణరావు, సహాయ కార్యదర్శిగా కొణతల నాగరాజు, మండల సమితి సభ్యులుగా వంకా అప్పారావు, దిద్దే నాగేశ్వరరావు, ఉయ్యూరు సత్యనారాయణ, ఎం.రాజేష్ తదితరులు ఎన్నికయ్యారు.